క్లుప్తంగా

శివలింగాన్ని చుట్టుకుని..



శివలింగాన్ని చుట్టుకున్న నాగేంద్రుడు

మనుబోలు: శివుడికి కంఠాభరణంగా నాగేంద్రుడు ఎప్పుడు దర్శనమిస్తుంటాడు. ఇలాంటి ఘటన మనుబోలు సమీపంలోని విశ్వనాథ స్వామి ఆలయంలో శనివారం కనిపించింది. నాగేంద్రుడు శివలింగాన్ని చుట్టుకుని పైన పడగ విప్పి దర్శనమిచ్చిన దృశ్యాన్ని అర్చకుడు శ్రీనివాసులు వీడియో తీసి వాట్సప్‌లో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. తాను ఆలయం వద్ద నిద్రిస్తుండగా వేకువజామున శబ్దం రావడంతో మేల్కొని చూడగా నాగేంద్రుడు శివలింగాన్ని చుట్టుకుని సుమారు 15 నిమిషాలు పడగవిప్పి ఉనట్లు ఆయన తెలిపాడు.

ధాన్యానికి మద్దతు ధర ఇవ్వండి



బుచ్చిరెడ్డిపాళెం: ప్రభుత్వ మద్దతు ధరకు తగ్గకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా నాయకులు కలిసి విన్నవించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని స్టాక్ పాయింట్ల పరిశీలనకు వచ్చిన ఆయన్ను శనివారం పలువురు కలిసి జిల్లాలోని పరిస్థితులను వివరించారు. ప్రతి మండలంలో ధాన్యం కల్లాలు, నిల్వ చేసుకునే గోదాములు, డ్రయ్యర్లను ఏర్పాటు చేయించాలన్నారు. వ్యవసాయ యంత్ర పరికరాలు, పవర్ స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టలు, జింక్, జిప్సం వంటి సూక్ష్మ పోషకాలను రైతులకు అందజేయాల్సిందిగా వినతిపత్రంలో పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చేవూరు వినయ్‌నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్ పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్య కోసం వివరాల నమోదు



మాట్లాడుతున్న ఏఓ

కొడవలూరు: ఈనెల 28వ తేదీలోగా సొంత పొలమున్న రైతులు విశిష్ట సంఖ్యకు నమోదు చేసుకోవాలని ఏఓ లక్ష్మి కోరారు. మండలంలోని కమ్మపాళెంలో విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు మండలంలో 72 శాతం మంది రైతులు నమోదు చేసుకున్నారన్నారు. వీఏఏ సుజిత్ ఉన్నారు.

కస్తూర్బా గాంధీకి నివాళి



ఇందుకూరుపేట : మహాత్మ గాంధీ సతీమణి కస్తూర్బా గాంధీ నేటి యువతకు ఆదర్శమని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమ కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆశ్రమంలో కస్తూర్బా గాంధీ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత గాంధీజీ, స్థల దాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇసుక అక్రమ రవాణా జరిగితే కేసులు పెట్టుకోవచ్చు

ముత్తుకూరు: పొదలకూరు మండలంలోని విరువూరులో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే కాకాణి సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన ప్రత్యేక ప్రజా విజ్ఞాపనల వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇసుకను ఉచితం చేశారని, ఇందులో అక్రమ రవాణా ఊసే లేదన్నారు. అక్రమ రవాణా జరిగి ఉంటే కేసులు పెట్టి పెనాల్టీ వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కండలేరులో 52.521 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 52.521 టీఎంసీల నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 640, లోలెవల్ కాలువకు 210, హైలెవల్ కాలువకు 190, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

పరిహారంపై రైతుల అసంతృప్తి

- నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్‌కు భూసేకరణ
- భూములకు తక్కువ ధర నిర్ణయించారంటున్న అన్నదాతలు
- ముందుకు సాగని పనులు
- న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కొందరు
- కలెక్టర్, ఆర్డీఓ పర్యటన



అంకుపల్లిలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్ (ఫైల్)

పొదలకూరు: నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణానికి సంబంధించి మండలంలోని రైతుల నుంచి సేకరించిన భూములకు ఇప్పటి వరకూ పరిహారం ఇవ్వలేదు. తమను సమన్వయం చేసుకుని పరిహారాన్ని సంతృప్తికర స్థాయిలో చెల్లించలేకపోయినట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నిర్ణయించిన ధరలకు సమ్మతించని వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వాస్తవ పరిస్థితికి దూరంగా తమ భూములకు అధికారులు పరిహారాన్ని నిర్ణయించినట్టు అన్నదాతలు మండిపడుతున్నారు. అలైన్మెంట్ మార్చమని అధికారులను కోరినా వినలేదని వారు చెబుతున్న మాట.

మూడు గ్రామాల మీదుగా..

మండలంలోని అంకుపల్లి, వావింటపర్తి, దుగ్గుంటరాజుపాళెం గ్రామాల మీదుగా నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణ పనుల కోసం 2020 సంవత్సరంలో సర్వేను పూర్తి చేసి రాళ్లను నాటారు. ఈ నేపథ్యంలో అంకుపల్లిలో 57 ఎకరాలు, వావింటపర్తిలో మెట్ట, మాగాణి కలిపి 26.77 ఎకరాలు, దుగ్గుంటరాజుపాళెంలో పట్టా, డీకేటీ భూములు కలిపి 16 ఎకరాలను అధికారులు సేకరించారు.



వావింటపర్తిలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ అనూష (ఫైల్)

అయితే బహిరంగ మార్కెట్లో ధరకు అధికారులు నిర్ణయించిన గెజిట్ నోట్ పబ్లిష్ చేసిన ధరలకు చాలా వ్యత్యాసం ఉండటంతో రైతులు అంగీకరించలేదు. అంకుపల్లిలో రోడ్డు సైడ్ ఉన్న రూ.15 లక్షల విలువైన పట్టా భూములకు రూ.4 లక్షలు, దుగ్గుంటరాజుపాళెంలో రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలున్న పట్టా భూములకు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలను పరిహారంగా నిర్ణయించారు. దీంతో కడుపు మండిన రైతులు అధికారులు వాటికి సమ్మతించేది లేదని సంతకాలు పెట్టకుండా భీష్మించుకున్నారు. వీరిలో కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించి తీర్పు కోసం ఎదురు చూస్తున్నారు.

కలెక్టర్, ఆర్డీఓల పర్యటన

భూసేకరణ సమస్యల వల్ల రైల్వే లైన్ నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని పరిశీలించాలని కలెక్టర్ ఈ.ఆనంద్, నెల్లూరు ఆర్డీఓ అనూషాను వేర్వేరుగా రైతుల వద్దకు పంపారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ వల్ల కూడా వాస్తవ పరిస్థితిపై రైతులతో కలెక్టర్ గతేడాది అక్టోబర్‌లో సమావేశమయ్యారు. వారు తమకు అన్యాయం జరిగిందని న్యాయం చేయాల్సిందిగా రాతపూర్వకంగా విన్నవించుకున్నారు. ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.

అన్యాయం జరిగింది



రైల్వే లైన్ నిర్మాణంలో నా పొలం 2.75 ఎకరాలు సేకరించారు. అయితే పరిహారాన్ని నిర్ణయించడంలో అన్యాయం జరిగింది. ఎకరా రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల మాత్రమే చెల్లిస్తామన్నారు. వాస్తవానికి నా పొలం ఎకరా రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల విలువ ఉంది. దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించాం.

– సుధాకర్‌రెడ్డి, దుగ్గుంటరాజుపాళెం

కలెక్టర్ ఆశ్చర్యపోయారు



నా పొలానికి నిర్ణయించిన ధరలను తెలుసుకున్న కలెక్టర్ ఆశ్చర్యపోయి తక్కువగా ఉందన్నారు. రోడ్డు పక్కనే ఉన్న పొలానికి అధికారులు ఎకరాకు రూ.4 లక్షల పరిహారం నిర్ణయించారు. మొత్తం 2.50 ఎకరా రైల్వే లైన్ నిర్మాణంలో సేకరించడం జరిగింది. ఎకరా రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలకు అమ్ముడుపోతుంది. అందువల్లే న్యాయస్థానాన్ని ఆశ్రయించాం.

– కె.రామిరెడ్డి, అంకుపల్లి

పరీక్షలకు తొమ్మిది మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శనివారం నిర్వహించిన డిగ్రీ ఒకటో సెమిస్టర్, మూడో సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు తెలిపారు. 235 మందికి గానూ 226 మంది హాజరయ్యారని వెల్లడించారు.

వైభవంగా పల్లకి సేవ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్ శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామి, అమ్మవార్ల పల్లకి సేవ వైభవంగా జరిగింది. ప్రత్యేకాలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

కళ్లద్దాల పంపిణీ



ఇందుకూరుపేట: మండలంలోని ఆదెమ్మసత్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి అద్దాలను అందజేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు కిశోర్‌కుమార్, బ్రహ్మేశ్వరనాయుడు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెచ్‌ఎం శేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూస్తాం



చిన్నచెరుకూరు గ్రామంలో పరిశీలిస్తున్న అధికారులు

తోటపల్లిగూడూరు: జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూస్తామని జిల్లా పరిషత్ ఆర్‌డబ్ల్యూఎస్ కన్సల్టెంట్ అంజనీ పేర్కొన్నారు. మండలంలోని చిన్నచెరుకూరు గ్రామంలో గల కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ను ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి పంచాయతీలకు కేటాయించిన నిధులు సక్రమంగా వినియోగిస్తున్నారో?, లేదో? నిత్యం పర్యవేక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల ఆర్పీ తేలిమేటి సునీల్‌కుమార్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా రెడ్ల ఆత్మీయ సమ్మేళనం



జక్కంరెడ్డి కృష్ణారెడ్డికి సత్కారం

కోవూరు: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక పీవీఆర్ ఫంక్షన్ హాల్లో 'రాష్ట్ర స్థాయి రెడ్ల ఆత్మీయ సమ్మేళనం' శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఉయ్యాలవాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెడ్డి సంఘీయులు అధిక సంఖ్యలో పాల్గొని పలు సమస్యలపై చర్చించారు. రెడ్డిజాతి ఐక్యత, పురోభివృద్ధిపై పలువురు వక్తలు మాట్లాడారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు దొంతిరెడ్డి వేమారెడ్డి, మారం బ్రహ్మారెడ్డి, కల్లి శివారెడ్డి, పోతిరెడ్డి సిద్ధారెడ్డి హాజరై, పలు సూచనలు చేశారు. జక్కంరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రెడ్ల ఐక్యవేదిక కార్యవర్గ సభ్యులు నిర్మల నరసింహారెడ్డి, డాక్టర్ బీవీ రెడ్డి, వెందోటి ధనుంజయరెడ్డి, కాటంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, హెటైక్ రమణారెడ్డి, గుండాల ప్రతాప్‌రెడ్డి, బూదూరు మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నేత ల్యాండ్ మాఫియా


- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చలపతిరావు




మాట్లాడుతున్న చలపతిరావు

కొడవలూరు : నార్తురాజుపాళెంలో టీడీపీ నాయకుడు యోగానందరెడ్డి ల్యాండ్ మాఫియాకు పాల్పడ్డాడని, అతనిపై క్రిమినల్ కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు డిమాండ్ చేశారు. మండలంలోని నార్తురాజుపాళెం వీసీఆర్ అతిథి గృహ ప్రాంగణంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నార్తురాజుపాళెంలో 87–ఏ సర్వే నంబర్‌లో 28 సెంట్ల భూమి మాత్రమే కలిగి ఉన్న ఆయన 12.42 ఎకరాల్లో వేసిన అన్నమయ్య గ్రీన్ వ్యాలీ లేఅవుట్‌లో 137 ప్లాట్లను అదే సర్వే నంబర్‌తో విక్రయించారని తెలిపారు. అంతేకాకుండా వీపీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాకు కూడా అదే సర్వే నంబర్‌తో స్థలం విక్రయించారని చెప్పారు. ఇక్కడి లేఅవుట్‌లో ప్లాట్లు కొన్న వారికి పంచాయతీ అప్రూవల్ కూడా రావడం లేదంటూ వాపోతున్నారన్నారు. గతంలో ఆయన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన 14.92 ఎకరాలను కూడా స్వాహా చేశారని, దీనిపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయన్నారు. ఈ మాఫియా నాయకుడిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరిరావు, నాయకులు కొండా శ్రీనివాసులురెడ్డి, మాణిక్యరావు, దేవిరెడ్డి సాయిరెడ్డి, మాగుంట గిరిధర్‌రెడ్డి, తాటిపర్తి భాస్కర్, మారంరెడ్డి రంగారెడ్డి, ఉదయభాస్కర్, గాలి సునీల్, బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ



ఇందుకూరుపేట : నరసాపురంలో..



కొడవలూరు : నార్తురాజుపాళెంలో..

ఇందుకూరుపేట: మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేస్ట్ మెటీరియల్‌తో బోధనా సామగ్రి తయారీ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఆర్పీ వెంకటేశ్వర్లు, రాజగోపాల్, సూపర్‌వైజర్లు లలితాంబ, సుబ్బరత్న, మంజుల పాల్గొన్నారు.

- కొడవలూరు: పిల్లల్లో సామాజిక భావోద్వేగం పెంపొందించాల్సిన అవసరం ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.నిర్మల, టి.నాగభూషణమ్మ తెలిపారు. నార్తురాజుపాళెంలోని జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమంలో ప్రీస్కూల్ పిల్లలకు శనివారం జన్మదిన వేడుక నిర్వహించారు. ఆర్పీలు అంకయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

కొడవలూరు: మండలంలోని గండవరంలో కొలువైన ఉదయకోశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు శనివారం అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా పుట్టమట్టి తెచ్చి స్వామివారి వద్ద ఉంచి పూజలు చేశారు. పెనాక శ్రీనివాసులురెడ్డి– కల్పన దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఆలం మాలకొండయ్య, ఈఓ బండి శాంతయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి..

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక రామకృష్ణానగర్‌లో కొలువైన వెంకటేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనుంది. కొడిగుడ్డతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టి ధ్వజారోహణ, తిరుచ్చి సేవ, శేషవాహన సేవలు తొలిరోజు నిర్వహించనున్నారు.

వెంకయ్యస్వామికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో వెంకయ్యస్వామి

మనుబోలు: మండలంలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి మందిరంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసులు స్వామికి పంచామృతాభిషేకం జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. వివాహం, సంతానం కోసం పలువురు హోమ గుండం వేసి ధుని పూజ నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది.

పీహెచ్‌సీకి డీఎంహెచ్‌ఓ ప్రశంసలు



సేవల పట్టికను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

ముత్తుకూరు: రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, రక్త పరీక్షలు, కాన్పుల విషయంలో రెండునెలల పాటు వరుసగా ఏ గ్రేడ్ సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన ముత్తుకూరు పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ సుజాత అభినందించారు. వైద్యులు, సిబ్బంది సేవలను కొనియాడారు. శనివారం ఆమె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కొత్తగా మంజూరైన తాళ్లపూడి పీహెచ్‌సీలో వైద్యసేవలు ప్రారంభం కాకపోవడానికి గల కారణాలు తెలుసుకున్నారు. లక్ష్యాలు పూర్తి చేసుకున్న పనుల వివరాలను యాప్‌లలో నమోదు చేయాలన్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రోగుల సేవలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు దేవీకృప, చందనప్రియ, సీనియర్ సహాయకుడు శేషగిరిరావు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

వెంకటాచలం: మండలంలోని గొలగమూడి వద్ద నున్న మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ప్రాజెక్ట్ బేస్‌డే లెర్నింగ్‌లో విద్యార్థినులు ప్రదర్శించిన యానిమల్ షెల్టర్, మినీ గార్డెన్ ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. త్వరలో విజయవాడలో జరిగే ప్రదర్శనకు వారు హాజరుకానున్నారు. ప్రతిభ చూపిన పి.రిషిత, ఎస్.సింధు, ఎం.యమున, డి.చిద్విలాస్య, ఎస్.పల్లవి, కె.జెస్సికా, గైడ్ టీచర్లు జి.తేజోకుమారి, ఎ.దీపిక, తేజస్వినిలను శనివారం ప్రిన్సిపల్ రమణప్రసాద్ అభినందించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతుల ప్రదానం

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృభాషతోనే వికసిత్ భారత్ సాధ్యమని హెచ్‌ఎం ఎం.సుజాత మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకత వికసించడం, ఆత్మ విశ్వాసంతో జీవించడం మాతృభాషతోనే సాధ్యమన్నారు. అనంతరం విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. సాహితీవేత్త గండికోట సుధీర్ కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి, రమణమ్మ, కనకదుర్గ పాల్గొన్నారు.

వారిపై చర్యలు తీసుకోరా..!

- విడవలూరు, మైపాడు బీసీ సంక్షేమ హాస్టళ్లలో చేతివాటం
- ఇద్దరు వార్డెన్లపై ఆరోపణలు
- విచారణ నివేదిక ఏమైందో..?



నెల్లూరులోని బీసీ వెల్ఫేర్ కార్యాలయం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని రెండు బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఇద్దరు వార్డెన్లు అవినీతికి పాల్పడ్డారని సంవత్సరం క్రితం ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఉన్నతాధికారులతో విచారణ జరిపించారు. అయినా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఉన్నతాధికారుల అండదండలు ఉండటంతో విచారణ నివేదికలను తొక్కి పెడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఏం జరిగిందంటే..

విడవలూరు బీసీ బాలుర హాస్టల్లో మంజూరైన సీట్లు 74 అయితే 77 మందిని అటెండెన్స్‌లో చూపించారు. వాస్తవానికి అక్కడ సగం మంది కూడా లేరు. బిల్లులు మాత్రం 77 మందికి మంజూరయ్యాయి. ఫేజ్ రికగ్నేషన్ వల్ల ఈ వాస్తవాలు సంవత్సరం క్రితం వెలుగులోకి వచ్చాయి. అదే విధంగా మైపాడు బాలుర హాస్టల్లో అసలు విద్యార్థులు లేకపోయినా వారికి సంబంధించిన బిల్లులు, భవన రెంట్‌ను పెట్టి మంజూరు చేయించుకున్నారు. ఈ రెండు హాస్టళ్లలో వార్డెన్లు రూ.కోటికి పైగా ప్రభుత్వ సొమ్మును స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ తతంగం జరిగి ఏడాదైంది. విడవలూరు, మైపాడు వార్డెన్ల అవినీతి ఆరోపణలపై కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఆయన మూడు నెలల క్రితం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణిని విచారణ చేయాలని ఆదేశించారు. ఆమె ఆ నివేదికను సమర్పించారు. కాగా శాఖాపరమైన విచారణ జరగ్గా దానికి సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు పంపడంలో ఆలస్యమైంది. దీనికి పాత అధికారి లాగిన్‌లో అది ఉండటమే కారణమని చెబుతున్నారు. కానీ జాప్యానికి ఆ శాఖలోని కొందరు ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల ఒత్తిళ్లు కారణమని సమాచారం. ఆ వార్డెన్లు ఇంకా అదే హాస్టళ్లలో పనిచేస్తుండటం గమనార్హం.

కలెక్టర్‌కు ఫైల్ పంపాం

సంబంధిత ఫైల్‌ను కలెక్టర్‌కు అందజేశాం. వారి ఆదేశాల రాగానే చర్యలు తీసుకుంటాం. గతంలో ఏం జరిగిందో నాకు తెలియదు. నేను నూతనంగా బాధ్యతలు స్వీకరించాను.

– వెంకటలక్ష్మి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి